క్లుప్తంగా

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం సోమవారం కడియంలోని ఫెలోషిప్ ప్రెసిడెంట్ డీఎల్ మోడీ మందిరంలో జరిగింది. ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ జీవరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ఏబీసీ ప్రెసిడెంట్ బిషప్ సోలోమోను, మండల పెంతెకోస్తల్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్ వాక్య సందేశాలు అందించారు. అనంతరం ఏబీసీ రీజినల్ చైర్మన్ కె.జయశీల్ ముగింపు ప్రార్థన చేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ సీహెచ్ రత్నదీప్, చీఫ్ పాట్రన్ సభ్యులు డాక్టర్ డి. రత్నరాజు, రాకడ రావు, జాయింట్ సెక్రటరీ ఏసురత్నం, సెక్రటరీ శామ్యూల్ రాజు పాల్గొన్నారు.

రాధాకృష్ణన్ స్మారక ఉపన్యాసం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ ఎంఎస్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వార్షిక స్మారక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా కటక్‌లోని శ్రీశ్రీ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ భరత్ దాస్ మాట్లాడుతూ పంచతంత్రం వంటి పురాతన గ్రంథాలలో కనిపించే నైతిక బోధనలు బాధ్యతాయుతమైన వ్యక్తులు, నాయకులను రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించాయన్నారు. నైతిక ప్రేరణ, ఆచరణాత్మక జ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో తత్వశాఖాధిపతి డాక్టర్ కె.సీతామహాలక్ష్మి, తత్వశాస్త్ర అధ్యాపకులు సత్యం సూర్యనారాయణ, ముప్పిడి మహేష్, డాక్టర్ గౌతమ్, నూజిళ్ల శ్రీనివాస్, ఫరా, ఎస్.రాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కడియం: కడియం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి సత్యప్రసాద్ సోమవారం పరిశీలించారు. చిన్నారులకు ప్రభుత్వం నుంచి అందించే పోషకాహారం, ఆటవస్తువులపై ఆరా తీశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకూ తుమ్మలావ, రెడ్డిలపేట, గోదావరి గట్టు, ఆర్యాపురం, శేషయ్యమెట్ట, జిల్లా కోర్టు వెనుక భాగంలో సరఫరా ఉండదన్నారు.

బుధ, గురువారాల్లో..

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ తొర్రేడు, టిడ్కో ఇళ్లు, వెంకటనగరం గ్రామంలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుంది.

ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా సత్యనారాయణ

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా సీతానగరం మండలం బొబ్బిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరు రవి, ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు, సంఘ పెద్దలు జీవీ నారాయణ రెడ్డి, దేవినేని వెంకటరమణ, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సాధన, పాఠశాల నిర్వహణలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు.

సర్పంచ్‌లకు రోల్‌మోడల్ శంభాజీరావు



శంభాజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరజాల బాబు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు ఎంతోమంది సర్పంచ్‌లకు గ్రామాభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలిచారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) కొనియాడారు. ఆయన సోమవారం బొమ్మూరులోని మద్దిపోటి శంభాజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా శంభాజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పా పరిమళ కుమార్ (నాని), తాతపూడి జిమ్మి, గ్రామప్రజలు అధిక సంఖ్యలో హాజరై శంభాజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలి

సీతానగరం: స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఆవిష్కాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఆవిష్కాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులతో ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ మాధవ్, నాగేశ్వరరావు, డాక్టర్ సుధామయి, అలేఖ్య పాల్గొన్నారు.

పూడికతో అవస్థలు

- గ్రావెల్ రోడ్డుపై డంప్ చేసిన ఆవ కాలువ వ్యర్థాలు, పూడిక
- మూసుకుపోయిన రోడ్డు
- రాకపోకలకు వీలు లేని వైనం
- నేతాజీ నగర్ వాసులకు ఇబ్బందులు



గుర్రపు డెక్క, వ్యర్థాలు డంప్ చేయడంతో నిరుపయోగంగా మారిన గ్రావెల్ రోడ్డు



గుర్రపు డెక్కతో నిండి పోయిన బొమ్మూరు ఆవ కాలువ

రాజమహేంద్రవరం రూరల్: ప్రయాణాలతో పాటు వివిధ వస్తువుల రవాణాకు రోడ్లు ఎంతో కీలకంగా ఉంటాయి. రహదారులు బాగున్న ప్రాంతాల్లో అభివృద్ధి కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రోడ్లను అభివృద్ధి చేయడానికి, కొత్త వాటిని నిర్మించటానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తాయి. కానీ ఇక్కడి గ్రావెల్ రోడ్డు మాత్రం దానికి భిన్నంగా మారింది. పూడిక, వ్యర్థాలను డంప్ చేయడంతో మూసుకుపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టిన తరువాత బొమ్మూరు నేతాజీ నగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంత ప్రజల సౌకర్యార్థం గ్రావెల్ రోడ్డు నిర్మించారు. దానిపై ప్రజలు రాకపోకలు సాగిస్తుండేవారు. అయితే ప్రస్తుతం ఆవ కాలువ పూడిక తీత, మట్టి వ్యర్థాలతో ఆ దారి మూసుకుపోయింది.

గ్రావెల్ రోడ్డు నిర్మాణం

ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్ నిర్మాణం తర్వాత బొమ్మూరులోని నేతాజీ నగర్, బృందావన్ కాలనీ ప్రాంతాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే సెయింటాన్స్, గురుకులం విద్యార్థులు పాఠశాలలకు వచ్చే సమయంలో ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురయ్యేవి. దీంతో రూ.20 లక్షలతో నేతాజీ నగర్ మొదట వీధి నుంచి సెయింటాన్స్, గురుకులం వెనుకగా ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్ రోడ్డుకు కలుపుతూ గ్రావెల్ రోడ్డును మంజూరు చేశారు. కాంట్రాక్టరు సైతం మూడు లేయర్లు వరకు వేసి గ్రావెల్ రోడ్డు నిర్మించారు. కానీ ఫినిషింగ్ చేయాల్సి ఉంది. దీంతో ఆ రోడ్డులో నేతాజీ నగర్, బృందావన్ కాలనీ వాసులు రాకపోకలు సాగించారు. స్కూలు విద్యార్థులకు సైతం ఎంతో ఉపయోగంగా ఉండేది.

పూడిక తీత

అయితే వర్షాకాలం నేపథ్యంలో ముంపు సమస్య లేకుండా ఉండేందుకు హుకుంపేట వరలక్ష్మి కాలనీ నుంచి చెరుకూరి గోడౌన్స్ వెనుక నుంచి బొమ్మూరు నేతాజీ నగర్ మీదుగా వెళుతున్న ఆవ కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. కాలువలో జేసీబీల ద్వారా తీసిన గుర్రపుడెక్క, మట్టిని గ్రావెల్ రోడ్డుపై డంప్ చేశారు. కానీ దాన్ని దూర ప్రాంతానికి తరలించలేదు. ఆ పూడిక తీసి దాదాపు మూడు నెలలకు పైగా కావడంతో ఆ ప్రాంతం ఇప్పుడు చిట్టడవిని తలపిస్తోంది. వ్యర్థాలు, మట్టితో రోడ్డుపై రాకపోకలకు వీలు లేకుండా పోయింది. కాలువలో తీసి రోడ్డుపై వేసిన పూడికను తొలగిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. కానీ కాంట్రాక్టర్ ఆ పని మర్చిపోయాడు.

అధికారులు స్పందించాలి

నేతాజీ నగర్, బృందావన్ కాలనీ ప్రాంతాల వాసుల సౌకర్యార్థం గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంకుస్థాపన చేశారు. గ్రావెల్ రోడ్డు సగం పూర్తయినప్పటికీ ప్రజల రాకపోకలకు, వాకింగ్‌కు అనువుగా ఉండేది. ఆవ కాలువ పూడికను ఆ రోడ్డుపై వేయడంతో నిరుపయోగంగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ రోడ్డుపై చెత్తను తొలగించి, త్వరితగతిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– మెట్ల వెర్రియ్య, సామాజిక కార్యకర్త, బొమ్మూరు

ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 17 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ అవుతున్న కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీలను ఏ దశలోనూ పెండింగ్ ఉండకూడదని, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా రోజువారీ అర్జీలను ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇన్‌చార్జి) రీటా, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజలు ఏడు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి, అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మహాత్మాజ్యోతీరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ జి.అఖిల సోమవారం ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మండపేటలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.హేమలత జూనియర్స్, ఉమెన్స్ విభాగంలో, ఎనిమిదో తరగతి విద్యార్థిని యు.ప్రణీత వుమన్స్ విభాగం, పూర్వపు పదో తరగతి విద్యార్థిని కె.గౌతమి జూనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ ముగ్గురూ త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా.. ఆ విద్యార్థినులతో పాటు పీఈటీ కోట రమ్యను ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రబంధాలలో సరస్వతీ స్తుతి తప్పనిసరి



రాంభట్ల పార్వతీశ్వర శర్మను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

సీటీఆర్ఐ: ప్రాచీన ప్రబంధాలలో సరస్వతీ స్తుతి తప్పని సరిగా కనపిస్తుందని శతావధాని డాక్టర్ రాంభట్ల పార్వతీశ్వర శర్మ అన్నారు. గోదావరి గట్టున ఉన్న ఆంధ్ర యువతీ కళాశాలలో జరుగుతున్న 54వ సరస్వతీ సపర్యా మహోత్సవాలలో భాగంగా, సోమవారం ఆయన 'ప్రబంధ కవుల సరస్వతీ సపర్య' అనే అంశంపై ప్రసంగించారు. పోతనాది మహాకవులు భాగవత పురాణంలో ఇష్ట దేవతా స్తుతిలో చేసిన సరస్వతీదేవి స్తుతులు అత్యంత ప్రాచుర్యం పొందాయన్నారు. శ్రీనాథుని శృంగార నైషధం, పింగళి సూరన్న రచించిన ప్రభావతీ ప్రద్యుమ్నం తదితర రచనల్లో సరస్వతీదేవి పాత్ర కూడా కనిపిస్తుందన్నారు. ఏ ప్రబంధంలో చూసిన వీణాపాణి అయిన సరస్వతీదేవి కనపడుతుందన్నారు. అయితే తెనాలి రామలింగకవి సరస్వతీ దేవిని పరమశివుని సోదరిగా వర్ణించాడన్నారు. కొందరు కవులు నదీరూపంలో ఉన్న సరస్వతీదేవిని స్తోత్రం చేసార, ప్రాచీన ప్రబంధాలకు మూలం ఇతిహాస కావ్య పురాణాల్లోని కథలేనని ఆయన అన్నారు. పోతనామాత్యుని 'శారదనీరదేందు..' పద్యంలో సరస్వతీదేవిని వర్ణించిన తీరు అపూర్వమని, తెలుగునాట అత్యంత ప్రాచుర్యం పొందిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ స్వాగత వచనాలు పలికారు. సదనం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోట్ల కనకేశ్వరరావు, స్వర్ణశ్రీ, బలభద్ర లక్ష్మీకాంతం, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన వక్త రాంభట్ల పార్వతీశ్వర శర్మను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శతావధాని డాక్టర తాతా సందీప్ కిరాతార్జునీయం అనే అంశంపై ప్రసంగిస్తారు.

గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



అవార్డు అందుకుంటున్న న్యూటన్

సీటీఆర్ఐ: తెలుగు భాష ఖ్యాతిని ఇనుమడింపజేసిన గిడుగు రామ్మూర్తి పంతులు సేవలు చిరస్మరణీయమని ఇండో ఇజ్రాయేలు ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డెక్కపాటి ఆడమ్స్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండుకు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత సాఫల్య పురస్కారం అందించారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆడమ్స్ మాట్లాడుతూ తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఐజక్ న్యూటన్ పండు మాట్లాడుతూ విద్యావేత్తగా, సామాజికవేత్తగా నాలుగు దశాబ్దాలుగా చేసిన సేవల్ని గుర్తించి ఈ పురస్కారాన్ని ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు అద్దంకి రాజాయోనా పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన తన కుమార్తె ఏళ్ల రత్నకుమారి (30) కనిపించడం లేదని తల్లి యర్రగోగిల పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి రామ్‌కుమార్ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటున్న పార్వతి తన కుమార్తెను రఘుదేవపురానికి చెందిన మేడిశెట్టి శివకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. గత నెల 17న భార్యాభర్తలు ఇరువురు గొడవపడ్డారు. తరచూ దాడి చేసి కొడుతున్నాడని రత్నకుమారి తన తల్లికి ఫోన్ చేసింది. అప్పటి నుంచి రత్నకుమారి కనిపించడం లేదని పార్వతి తెలిపారు.

బిక్కవోలు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. బిక్కవోలుకు చెందిన మహిళ గత నెల 30 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త గణేష్ కుమార్ తెలిపారు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వినాయక నిమజ్జనాలలో జాగ్రత్తలు తప్పనిసరి



అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌కు ప్రసాదం అందజేస్తున్న కమిటీ సభ్యులు



శాటిలైట్‌సిటీలో వినాయకునికి పూజలు చేస్తున్న చందన నాగేశ్వర్



బాల గణపతిని నిమజ్జనానికి తీసుకువెళుతున్న పిల్లలు

- అనుమతి లేని ప్రాంతాల్లో చేయకూడదు
- అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: వినాయక నిమజ్జనాలలో భక్తులు జాగ్రత్తలు పాటించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన లక్ష్మిగణపతి నిమజ్జనాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, లడ్డూ వేలం జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని మంగళ వాయిద్యాలు, కోలాటం నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమాలకు చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని, యువత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఊరేగింపు మార్గంలో విద్యుత్ లైన్లపై జాగ్రత్త వహించాలని, ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా క్రమపద్ధతిలో ఒకేవైపు ఊరేగింపు కొనసాగాలన్నారు. వరదల కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున, అనుమతుల్లేని ప్రాంతాల్లో నిమజ్జనం చేయరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చవితి పందిళ్ల సందర్శన

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీలోని వినాయక చవితి పందిళ్లను ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ సోమవారం సందర్శించారు. విఘ్నేశ్వర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కొబ్బరికాయ కొట్టి విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఏ బీ బ్లాకుల్లో వినాయక ప్రతిమలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల గణపతి ఊరేగింపు

సీటీఆర్ఐ: వినాయక చవితి సందర్భంగా తుమ్మలావలోని చిన్నారులు.. బాల గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆ వినాయకుని నిమజ్జనం సందర్భంగా సోమవారం ఊరేగించారు. రెండు సైకిళ్లపై విగ్రహాన్ని ఉంచి, వీధుల్లో ఊరేగించారు.

పేరమాంబ సాహిత్య సేవలు ఆదర్శనీయం



జాతీయ పురస్కారం పొందిన ఉపాధ్యాయిని పేరమాంబను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: ఉత్తమ విద్యా బోధన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలను స్పృశిస్తూ రాసిన అనేక తెలుగు గేయాలు, పద్యాలు, గద్యాలు, కవితలు, వ్యాసాలు, తదితర సాహిత్య రచనలతో విశిష్ట సేవలు అందిస్తున్న స్థానిక తెలుగు భాషోపాధ్యాయురాలు డాక్టర్ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతి పేరమాంబ నేటి ఉపాధ్యాయలోకానికి ఆదర్శప్రాయురాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి అభినందించారు. సోమవారం స్థానిక హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదుకు చెందిన గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో శ్రీ సాయి లీలామృతం నిత్య పారాయణ గ్రంథ సాహిత్య రచనకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం అవార్డు అందుకోవటం అభినందనీయమన్నారు. గత నెల 31న హైదరాబాదు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో సంస్థ అధ్యక్షుడు గిడుగు క్రాంతి కృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బిక్కి కృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ అండ్ గ్లోబల్ నెట్‌వర్కింగ్ కమిటీ, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారని తెలిపారు. అవార్డులు, పురస్కారాలు సాహిత్య బాధ్యతలను మరింత పెంచిందని సీతామహాలక్ష్మి అన్నారు. పురస్కార గ్రహీత సీతామహాలక్ష్మిని స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బంగారు, వెండి సామగ్రి చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధవళేశ్వరం: పట్టపగలు ఇంట్లోకి చొరబడిన దొంగలు బంగారం, వెండి వస్తువులను అపహరించారు. స్థానిక గ్రంథాలయం వీధిలో జరిగిన ఈ ఘటనలో ఐదున్నర కాసుల బంగారం, 200 గ్రాముల వెండి చోరీకి గురయ్యాయి. పోలీసుల వివరాల మేరకు, గ్రంథాయం వీధిలో నివసిస్తున్న వంకా సాహిత్య సోమవారం ఉదయం ఇంటికి గడియ పెట్టి మేడపై పోర్షన్‌కు వెళ్లారు. కొంతసేపటి తర్వాత తిరిగొచ్చే సరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. దానిని పరిశీలించగా ఐదున్నర కాసుల బంగారు ఆభరణాలు ,200 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. ఈ మేరకు ఆమె ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో ఎస్సై బి.హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

307 మందికి వైద్య సేవలు



ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం నిర్వహించిన శ్రీరామకృష్ణ మఠం నిర్వహించిన వైద్య శిబిరంలో 244 మంది, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 63 మంది వైద్య సేవలు పొందారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం వారి శిబిరంలో రోగులకు వివిధ వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కంటి వైద్య శిబిరంలో 20 మందికి క్యాటరాక్ట్ అపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ వైద్యశిబిరాల నిర్వహణకు ఏఎన్ఎం బండి మంగ, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు

గురువులను గౌరవించడం అలవర్చుకోవాలి



రంగంపేటలో హైస్కూల్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జీఆర్టీ ప్రతినిధులు

రంగంపేట: అజ్ఞాన చీకట్లను తొలగించి విజ్ఞాన జ్యోతులు వెలిగించే గురువులను బాల్యం నుంచి గౌరవించడం అలవర్చుకోవాలనే లక్ష్యంతో గురువులను ఏటా సత్కరిస్తున్నామని రాజమహేంద్రవరం జీఆర్టీ జ్యువెలర్స్ మేనేజర్ సీహెచ్ రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.పార్థసారథి అధ్యక్షతన నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలో ఉన్నా, ఎంత ఉన్నత స్థితికి ఎదిగినా చదువు నేర్పిన గురువులను మరువరాదని ఆయన కోరారు. ఈ సందర్భంగా జీఆర్టీ సంస్థకు ప్రధానోపాధ్యాయుడితోపాటు ఆంగ్లోపాధ్యాయుడు వీసీ జాకబ్ తదితరులు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, సిబ్బందిని గోల్డెన్ గురూస్ అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ఎంఎస్ఆర్ నాయుడు మిమిక్రీ ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జీఆర్టీ సిబ్బంది గుణాల్, శ్రీనివాస్, రాంబాబు, రాణి, మంగ పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ సెంటర్ పరిశీలన

కోరుకొండ: అటల్ టింకరింగ్ ల్యాబ్ జిల్లాస్థాయి హబ్ సెంటర్ల పరిశీలన కోసం ముగ్గురు సభ్యులతో కూడిన రాష్ట్రస్థాయి సర్వే బృందం కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చింది. ఈ బృందంలో బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన రితీష్‌కుమార్, కావ్య, హార్షి ఉన్నారు. ఈ బృందం సోమవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నిస్తూ, ప్రయోగాలు, చేపట్టిన ప్రాజెక్టులపై ఆరా తీశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, స్కూల్ హెచ్ఎం రామారావు రెడ్డి, ఏటీఎల్ ఇన్‌చార్జులు బీఎల్‌వీఎన్ ఆనందబాబు, జె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సుందరకాండ
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలెస్	: సుందరకాండ
స్వామి	: కూలీ
అనుశ్రీ	: కూలీ
శివజ్యోతి	: బకాసుర రెస్టారెంట్
రాజా	: సుందరకాండ
ఊర్వశి	: కూలీ
మేనక	: సుప్రంసో
రంభ	: మహావతార్ నరసింహ
అప్సర	: వార్–2
అశోక	: వార్–2
నామవరం	
వీఎస్.మహల్	: కూలీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	:కూలీ, మహావతార్ నరసింహ
కడియం	
వెంకటసూర్య	: కూలీ